బొడ్రాయిలో
మరిన్ని వ్యాసాలు
epaper.ntnews.com

నమస్తే తెలంగాణ

# ప్రాంతీయ పార్టీల యుగం

**ప్రస్తుత** అసెంబ్లీ ఎన్నికల సీజన్‌లో మనం రెండురకాల దృశ్యాలు చూస్తున్నాం. జాతీయ పార్టీలమని విర్రవీగే కాంగ్రెస్, బీజేపీల దండ యాత్రలు వెలవెలపోవడం ఒకటైతే, రెండోది ముఖ్యమంత్రి కేసీఆర్ సభలకు పోటెత్తుతున్న జనసంద్రాలు. ఎన్ని కుట్రలు పన్ని, ఎన్నెన్ని బూటకాలు వల్లించినా ఢిల్లీ పెద్దల సభలకు జనం రావడం లేదు. వచ్చినా స్పందన కనిపించడం లేదు. 75 ఏండ్ల స్వతంత్ర భారత పాలనను ఆ రెండు పార్టీలే పంచుకున్నాయి. ప్రాంతీయ ఆకాంక్షలను అణగదొక్కి కేంద్రీకృత పాలన సాగించాయి. అయితే ఎంతగా కర్ర పెత్తనం సాగించినా ప్రాంతీయ ఆకాంక్షలు మలిగిపోలేదు. మరింత దేదీప్యమానంగా వెలిగి ఢిల్లీ పార్టీల పెత్తనాన్ని దహించివేశాయి, వేస్తున్నాయి. ద్రవిడపార్టీలు రంగం మీదికి వచ్చిన తర్వాత తమిళనాడులో జాతీయపార్టీలకు దిక్కు లేకుండా పోయింది. ఇప్పట్లో అక్కడ జాతీయ పార్టీలు కోలుకునే అవకాశాలు కనిపించడం లేదు. బెంగాల్‌లో తృణమూల్, ఒడిశాలో బీజేడీ, ఢిల్లీలో ఆప్ ఇలా ప్రాంతీయ ఆకాంక్షలు ఒక్కోచోట ఒక్కో రూపాన్ని సంతరించుకున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల యుగం నడుస్తున్నది.

ఢిల్లీ పార్టీలకు రాష్ట్రాల్లో 'జీ హుజూర్ జో హుకుం' అని సలాములు కొట్టే గులాములు ఉంటారు. ఒకప్పటి సామంతరాజులకు, వీరికి పెద్దగా తేడా ఉండదు. పాదుషాలకు కప్పం కట్టాలి, పదవులు కొట్టాలనేది వారి లక్ష్యంగా ఉంటుంది. ఎక్కడో దూరాన కూర్చున్న బడా బాబులకు ఇక్కడివారి గోసలు, అవసరాలు అర్థం కావు. ఇది అంతిమంగా ప్రాంతీయ అసమానతలు, వివక్షలకు దారితీస్తుందనేది ఇన్నేండ్ల చరిత్ర చెప్తున్న సత్యం. ఢిల్లీకి, గల్లీకి మధ్య జరిగే ఘర్షణలోంచి పుట్టుకువచ్చినవే ప్రాంతీయ పార్టీలు. నాడు కాంగ్రెస్ కాళ్లకింద తెలుగువారి ఆత్మగౌరవం నలిగిపోతున్నదనే ఆగ్రహంతో ఎన్టీఆర్ ప్రకటించిన యుద్ధం ఢిల్లీ పెత్తనానికి అడ్డుకట్ట వేసింది. ఇక తెలంగాణ అస్తిత్వం కోసం రాజీలేని పోరాటం సాగించి స్వరాష్ట్రం సాధించిన నేతగా కేసీఆర్ ప్రజల ఆశీస్సులతో పగ్గాలు చేపట్టడం అపురూపం, అద్వితీయం. రెండు విడతలు గెలిచి ఇప్పుడు మూడో విడుతకు లంఘిస్తుండటం అపూర్వం. రాష్ట్ర ప్రజల ఆశయాలు, ఆకాంక్షలపై సీఎం కేసీఆర్‌కు సమగ్రమైన అవగాహన ఉండటమే ఇందుకు కారణం.

సీఎం కేసీఆర్ ఒక సందర్భంలో ప్రశ్నించినట్టు మన పిల్లలకు ఎలాంటి చదువు చెప్పాలో ఢిల్లీలో కూర్చొని ఆలోచించేవాడికి ఏం తెలుస్తుంది? ఇక్కడ ఆహార విహారాల, ఆచార సంప్రదాయాల గురించిన అవగాహన వారికి ఎందుకుంటుంది? హైదరాబాద్ సంస్థానంలోకి కేంద్ర బలగాల ప్రవేశంపై ఏడాదికోసారి బీజేపీ హంగామా చేస్తుంటుంది. ఇక్కడి ప్రజల ఆలోచనలకు భిన్నంగా మాట్లాడి మనసు నొప్పిస్తుంది. కేంద్ర పార్టీలకు జెండాలు, ఎజెండాలు వేరుగా ఉండొచ్చు. కానీ, వాటిలో ఉన్న ఉమ్మడి అంశం ప్రాంతీయ ఆకాంక్షలను అణచివేయడం. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవడం. ఈ దాష్టీకం ఇంకానా, ఇకపై సాగదని ఎక్కడికక్కడ ప్రజలు నిలదీసి కలబడితే ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించాయి. భిన్న భాషలు, విభిన్న సంస్కృతులకు నిలయమైన దేశంలో ప్రజాభీష్ట సిద్ధికి ప్రాంతీయ పార్టీలే శ్రీరామరక్ష.



# కండ్ల ముందే అభివృద్ధి



కన్నోజు మనోహరాచారి
79950 89083

ఒక రాష్ట్రం ప్రగతి సాధించాలంటే నీరు కరెంటు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, కమ్యూనికేషన్స్ రంగాలదే కీలకపాత్ర. ఈ రంగాల అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ ముందువరసలో ఉన్నది. చెడగొట్టడం, కూలగొట్టడం చాలా సులువు. పునర్నిర్మాణం చాలా కష్టం. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ జేబులో నుంచి ఇచ్చింది కాదు. లక్షల మంది చేసిన పోరాట ఫలితం తెలంగాణ రాష్ట్రం. స్వరాష్ట్ర సాధన కోసం ఎగిసిపడిన మంటలకు కేంద్రంలో నాడు ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా తెలంగాణ తప్పనిసరిగా ప్రకటించవలసిందే. తెలంగాణ ఎవరి భిక్ష కాదు.

తెలంగాణ వచ్చింది మొదలు గత తొమ్మిదేండ్లలో తెలంగాణలో అభివృద్ధి జరిగిందా లేదా అనేది ఎవరికి వారు ఆత్మ విమర్శ చేసుకుంటే జరిగిన అభివృద్ధి కనపడుతుంది. 10 జిల్లాలున్న తెలంగాణ నేడు 33 జిల్లాలైంది. రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీల సంఖ్య బాగా పెరిగింది. పట్టణాల సంఖ్య పెరిగింది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు పెరిగాయి. తొమ్మిదేండ్లలో ప్రజాప్రతినిధుల సంఖ్య మూడింతలు పెరిగింది. అధికారుల సేవలు ప్రజలకు దగ్గరైనయి. ప్రభుత్వం ప్రజల చేరువలోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు దగ్గరయ్యాయి. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్ భవనాలు, ఎస్పీ ఆఫీసులు ప్రత్యక్షంగా కనబడుతున్నాయి. దేశంలోనే వరంగల్‌లో అతి పెద్దగా నిర్మిస్తున్న కాళోజీ నారాయణరావు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటుగా జిల్లాకో మెడికల్ కాలేజీ, హైదరాబాద్‌లో నిర్మిస్తున్న నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నూతన సచివాలయ భవన నిర్మాణం. 24 గంటలు శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం నిర్మించిన పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్.. ఇవన్నీ తొమ్మిదేండ్ల అభివృద్ధి పనులు కావా? ఇవన్నీ తెలంగాణ ప్రజల కోసం చేసినవి కావా?

2014కు ముందు అధ్వాన్న దశలో ఉన్న తెలంగాణను, నేడు వైభవంతో వెలిగిపోతున్న తెలంగాణతో ప్రజలు పోల్చి చూసుకోవాలి. మిషన్ కాకతీయ, హరితహారం కార్యక్రమాలతో భూగర్భ జలాలు పెరిగినయి. అటవీ సంపద పెరిగింది. తొమ్మిదేండ్ల తెలంగాణలో మతకలహాల్లేవు. పల్లెప్రగతితో పల్లెలు ఆహ్లాదంగా ఉన్నాయి. రైతుబంధు, కల్యాణలక్ష్మి పథకాలతో గ్రామస్థులకు మేలు జరగలేదా? ఆసరా పథకంతో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు మేలు జరుగుతున్న విషయం మరిచిపోతున్నారా? హైదరాబాద్ విశ్వ నగరంగా రూపుదిద్దుకొన్న మాట అబద్ధమా? ఫ్లై ఓవర్లు, స్కై వేలు, అండర్ పాసుల వల్ల ట్రాఫిక్ రద్దీ తొలగిపోయిన మాట వాస్తవం కాదా? మెట్రోరైల్ విస్తరణ పనులు కనబడటం లేదా?

చెప్పుడు మాటలు, తప్పుడు ప్రకటనలు చూస్తే మొదటికే మోసం వస్తుంది. మోసపోతే గోస తప్పదు. అందుకే తప్పుడు మాటలను వినొద్దు. ఈ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి గర్వపడాలి కానీ, ఇంత కన్నా గొప్పగా మరేదో జరగబోతుందని అనుకున్నపుడు ప్రస్తుత తెలంగాణ అభివృద్ధి ఆగిపోతుంది. మనకు మనమే నష్టపోతాం.

తెలంగాణను 60 ఏండ్ల పాటు అధోగతి పాలు చేసినవాళ్లు, పదేండ్లుగా పగ సాధిస్తున్నవాళ్లు చీకట్లో చేతులు కలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు కుట్రవాదులంతా మూకుమ్మడిగా తెలంగాణపై దండయాత్ర మొదలుపెట్టారు. మసిపూసి మారేడు కాయ చేసి ప్రజలను ఏమార్చటంలో సాటిలేని కాంగ్రెస్, బీజేపీకి ఇప్పుడు ఉమ్మడి లక్ష్యం ముఖ్యమంత్రి కేసీఆరే. అందుకే మిడతల దండులా దేశం నలుమూలల నుంచి ఆ రెండు పార్టీల నేతలు తెలంగాణ గల్లీగల్లీకి వచ్చి పడుతున్నారు.

సవ్యసాచిలా రెండు జాతీయ పార్టీలను నిలువరిస్తున్న కేసీఆర్‌ను ఎలాగైనా దెబ్బతీయాలని కుట్రల మీద కుట్రలు పన్నుతున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యర్థి ఒక్కరే. ఆయనే కేసీఆర్. అందుకే ఆయనను తెలంగాణలోనే కట్టడి చేసేందుకు ఆ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజల ముందు గంభీరమైన ఓ ప్రశ్న నిలిచి ఉన్నది. స్వయంపాలన వైపు తలెత్తుకొని ఉండటమా? మళ్లీ ఢిల్లీకి గులాములుగా మారిపోవటమా?

# కేసీఆర్‌పై విపక్షాల దండయాత్ర



వెల్జాల చంద్రశేఖర్
98499 98092



**ఒక్కడే వటవృక్షమై..:** తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ బయల్దేరినప్పుడు ఆయన ఒక్కడే. తెలంగాణ వ్యతిరేక శక్తులన్నీ ఏకమైనా లెక్కచేయకుండా మొక్కవోని ధైర్యంతో కేసీఆర్ ముందుకుసాగారు. అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సుసాధ్యం చేశారు. సాధించుకున్న రాష్ట్రం సగర్వంగా తలెత్తుకొని నిలబడాలన్నా, సురక్షితంగా మనుగడ సాగించాలన్నా కేసీఆర్‌తోనే సాధ్యమని నమ్మిన ప్రజలు 2014లో తొలి అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వానికి జై కొట్టారు. అయినా ఆగని తెలంగాణ వ్యతిరేక శక్తులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు నోటు వంటి కుట్రలకు పాల్పడ్డాయి. వాటిని ఓ కంట కనిపెడుతూనే ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ, అభివృద్ధిలో తెలంగాణను దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో తన దక్షతను చాటుకున్నారు. కొత్త రాష్ట్రం కేసీఆర్ చేతిలోనే సురక్షితంగా ఉంటుందని ప్రజల్లో ప్రబలమైన నమ్మకం పాదుకొన్నది. తెలంగాణ ఏ రంగాల్లో నిర్లక్ష్యానికి, వివక్షకు గురైందో లోతుగా అధ్యయనం చేసి ఒక వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని సమాంతరంగా సీఎం కేసీఆర్ ముందుకు తీసుకువెళ్లారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగింది. వారి నమ్మకానికి సాక్షిగా ప్రజలు రెండోసారి బీఆర్ఎస్‌కు మరింత మెజారిటీతో బ్రహ్మరథం పట్టారు. గత తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన ప్రతి ఎన్నికల్లో తామూ కేసీఆర్ వెంటే ఉన్నామని ప్రజలు నిరూపిస్తూ వచ్చారు. కేసీఆర్ నాయకత్వాన్నే ప్రజలు ఇప్పటికీ కోరుకుంటున్నారు. దీంతో కేసీఆర్ మూడోసారి కూడా ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగారు. దశాబ్దకాలంగా తెలంగాణలో తమకు తావులేకుండా చేసిన సీఎం కేసీఆర్ అంటే కాంగ్రెస్, బీజేపీ రెండింటికీ కంటగింపుగా మారింది. ఈ పార్టీలు వేర్వేరుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పటికీ వాటికి కేసీఆరే లక్ష్యం. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజం ఇప్పుడు ఏ గట్టున నిలబడుతుందనే ప్రశ్న తలెత్తింది. ఢిల్లీకి గులాంగిరీ చేసే కాంగ్రెస్, బీజేపీ గట్టున ఉందామా? లేక కేసీఆర్ నేతృత్వంలో సాగుతున్న తెలంగాణ స్వీయ పాలన గట్టున ఉందామా? అది తెలంగాణ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి తీసుకోవాల్సిన నిర్ణయం. అంతిమంగా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ సరైన నిర్ణయం తీసుకోవాల్సిన తరుణం ఇది.

**ఒక ప్రాంతీయ పార్టీకి దేశవ్యాప్తంగా ఇంతటి ఆదరణ లభించడం బీజేపీకి మింగుడుపడని అంశం. అందుకే తెలంగాణకు రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రావాల్సిన వాటిని ఇవ్వకుండా కక్ష సాధిస్తున్నది. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను పెంచాలని శాసనసభలో తీర్మానం చేసి పంపినా పక్కన పడేసింది. రాష్ట్రంలో ఏదైనా ఒక నీటిపారుదల ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని కోరినా పెడచెవిన పెట్టింది.**

**ఏకమైన జాతీయ పార్టీలు:** సీఎం కేసీఆర్ దశాబ్దకాలంగా కాంగ్రెస్, బీజేపీకి కొరకరాని కొయ్యగా తయ్యారయ్యారు. కేసీఆర్ మూడోసారి గెలిచి అధికారంలోకి వస్తే లోక్‌సభ ఎన్నికల నాటికి జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతారన్న భయం ఈ పార్టీలకు పట్టుకున్నది. అందుకే కేసీఆర్‌ను ఈసారి ఎలాగైనా ఓడించి కట్టడి చేయడానికి ఆ పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఈ పార్టీలు వేర్వేరుగా కూటములు కట్టినప్పటికీ, కేసీఆర్‌ను ఎదుర్కోవడంలో మాత్రం ఏకాభిప్రాయంతో ముందుకుసాగుతున్నాయి. అందుకే బీజేపీకి 'బీ' టీం అని కాంగ్రెస్, కాంగ్రెస్‌కు 'బీ' టీం అని బీజేపీ బద్నాం చేస్తున్నాయి. బీజేపీ మరో అడుగుముందుకేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలకు ఎర వేయడానికి చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఈ ఉదంతంలో ప్రజాక్షేత్రంలో బీజేపీని దోషిగా కేసీఆర్ నిలబెట్టడంతో అప్పటి నుంచి కేంద్రం మరింత కక్ష పెంచుకున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలువాలన్న పట్టుదల కంటే, కేసీఆర్‌ను ఓడించాలన్న లక్ష్యంతోనే ప్రధాని మోదీ, బీజేపీ నేతలు అమిత్ షా, జేపీ నడ్డా ఏడాది కాలంగా తెలంగాణపై దృష్టి సారించారు. కాంగ్రెస్ పార్టీ అయితే గుజరాత్ ఎన్నికలను కూడా లైట్ తీసుకొని తెలంగాణపై ఫోకస్ పెట్టింది. పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ గత ఆరు నెలలుగా తెలంగాణ చుట్టే తిరుగుతున్నారు. కేసీఆర్‌ను ఎదుర్కోవడానికి పార్టీతో సంబంధం లేకపోయినా డబ్బులు ఖర్చుపెట్టే వారికే టికెట్లు ఇచ్చి కాంగ్రెస్ ఎన్నికల బరిలోకి దించింది. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో అధికారంలోకి రావడం ఆ పార్టీకి మరింత కలిసి వచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యతను ఆ పార్టీ అధిష్ఠానం కర్ణాటక ప్రభుత్వ అధినేతల భుజాన మోపింది. ముఖ్యంగా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు ఆ బాధ్యతలను అప్పగించింది. దీంతో కర్ణాటకలో మంత్రులు, కాంట్రాక్టర్లు, రెవెన్యూ రాబడి అధికంగా ఉండే అధికారులకు ఆయన లక్ష్యం పెట్టి నిధులు సమీకరిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలా సమీకరించిన డబ్బే రూ.100 కోట్లు నెల రోజుల కిందట బెంగళూరులో ఐటీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే.

**ఒక్కటైన వ్యతిరేక శక్తులు:** జాతీయపార్టీల కుట్రలు ఢిల్లీలో కొనసాగుతుండగా, హైదరాబాద్‌లో మరో రకమైన కుట్రలకు అంకురార్పణ జరిగి.. అమలు కూడా మొదలైంది. సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోలేక గత రెండు పర్యాయాలు చతికిలపడిన తెలంగాణ వ్యతిరేకశక్తులు, తమ బుద్ధి మార్చుకోకుండా మూడోసారి కూడా కుట్రలకు తెరలేపాయి. హైదరాబాద్ వెళ్లాలంటే వీసా తీసుకోవాలా? అని ప్రశ్నించిన వైఎస్ కూతురు షర్మిల, తాను తెలంగాణ బిడ్డనేనంటూ ఎన్నికలకు ఆరు నెలల ముందు ఉన్నట్టుండి రోడ్లపైకి వచ్చారు. అయితే, ఆమె సొంత పార్టీ పెట్టి కాలికి బలపం కట్టుకొని తిరిగినా తెలంగాణ సమాజం కనీసం పట్టించుకోలేదు. దీంతో ఆమె కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా ప్రొఫెసర్ కోదండరాం కూడా ప్రత్యేకంగా తెలంగాణ జన సమితి (టీజేఎస్)ను ఏర్పాటుచేశారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించడానికి తెలంగాణ వ్యతిరేక శక్తులతో చేతులు కలపడానికి కూడా వెనుకాడలేదు. ఈ కపట బుద్ధిని గుర్తించిన ప్రజలు ఆయన పార్టీకి డిపాజిట్లు కూడా దక్కకుండా చేశారు. దీంతో కేసీఆర్‌ను ఓడించేందుకు ఈసారి పోటీకి దిగకుండా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటునుంచి ఎనిమిదేండ్లు ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి బహుజన సమాజ్ పార్టీ బాధ్యతలు చేపట్టారు. ఆయన కూడా కేసీఆర్‌ను ఓడించడం ఒక్కటే తన లక్ష్యంగా ప్రకటించారు. మరో వైపు ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని సీఎం కేసీఆర్‌పై బురద జల్లడమే పనిగా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడుగడుగునా అడ్డుపడిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రియ శిష్యుడైన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం పీసీసీ అధ్యక్షునిగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేయకుండా విదేశాలకు పారిపోయిన కిషన్‌రెడ్డి ఇప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న బండి సంజయ్‌కి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి కట్టబెట్టి ఎన్నికల్లో ప్రచార బాధ్యతలు అప్పగించింది. పార్టీలకతీతంగా తెలంగాణ వ్యతిరేకశక్తులు ఏకమై కేసీఆర్‌ను ఓడించే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నాయి. రేవంత్‌రెడ్డి, కోదండరాం, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, పవన్‌కల్యాణ్, విజయశాంతి, షర్మిల, కేఏ పాల్ తదితరులంతా పరస్పర అవగాహనతోనే ఈ ఎన్నికల్లో పనిచేస్తున్నారు.

**కాంగ్రెస్‌కు కక్ష ఎందుకు?:** కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి రాకుండా నిలువరించడానికి కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో బీజేపీ వ్యతిరేక పార్టీలు 'ఇండియా' కూటమి పేరిట జతకట్టాయి. దీనికి కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నది. ఈ కూటమి కట్టడానికి ముందే కేంద్రంలో బీజేపీ సర్కార్ వైఫల్యాలను బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎండగడుతూ వచ్చారు. ప్రధాని మోదీ హయాంలో దేశం ఏ విధంగా అధోగతి పాలైందో ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక దశలో బీజేపీని ఎండగట్టడంలో కేసీఆర్‌కు మించిన నాయకుడు లేడన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలోకి కేసీఆర్‌ను చేర్చుకుంటే బీజేపీ పట్ల మెతక వైఖరితో ఉన్న కాంగ్రెస్ పప్పులుడకవని భయపడింది. కాంగ్రెస్ కంటే ఎక్కువగా బీజేపీతో పోరాడుతున్న కేసీఆర్ పట్ల ఈ కూటమిలోని కొన్ని పార్టీలు సానుకూలంగా ఉన్నాయి. ఇది కూడా కాంగ్రెస్‌కు మింగుడుపడని అంశం. పైగా ఈ కూటమి ఏర్పడకముందే బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకం చేసేందుకు కేసీఆర్ దేశవ్యాప్తంగా పర్యటించారు. దీంతో జాతీయస్థాయిలో ప్రతిపక్ష కూటమికి పెద్దన్న పాత్ర పోషించే తమకు భవిష్యత్తులో కేసీఆర్ ప్రతిబంధకంగా మారుతారని కాంగ్రెస్ భయపడింది. ఈ నేపథ్యంలో బీజేపీ వ్యతిరేక కూటమిలోకి కేసీఆర్‌ను ఆహ్వానిస్తే మేము రాబోమని తేల్చిచెప్పినట్టు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్వయంగా వెల్లడించారు. బీజేపీని వ్యతిరేకించడంలో కాంగ్రెస్ కంటే ముందున్న కేసీఆర్ లేకుండా ఏర్పడే కూటమికి అర్థం లేదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ వంటి ముఖ్యులు బాహాటంగానే ప్రకటించారు. ఉత్తర, దక్షిణాదిలో ఎక్కడా బలంగా లేని కాంగ్రెస్‌కు ఇటీవల కర్ణాటకలో అధికారం దక్కడంతో ఆశలు చిగురించాయి. తమిళనాడులో ఎలాగూ తమ మిత్రపక్షం డీఎంకే అధికారంలో ఉన్నది. కేరళలో అధికారంలో ఉన్న సీపీఎం కూడా ఇండియా కూటమిలో ఉన్నది. ఇక లేనిదల్లా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే. అందుకే ఎలాగైనా తెలంగాణలో పాగా వేయలన్నది కాంగ్రెస్ లక్ష్యం. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ప్రీ ఫైనల్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాగంగా తెలంగాణలోనూ గెలిస్తే జాతీయస్థాయిలో కాంగ్రెస్ పట్ల సానుకూలత ఉన్నట్టు సంకేతాలు పంపవచ్చన్నది కాంగ్రెస్ వ్యూహం. తెలంగాణ, కర్ణాటక రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే సార్వత్రిక ఎన్నికలకు ఇక్కడినుంచి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించవచ్చన్నది ఆ పార్టీ మరో ఆలోచనగా రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడి నుంచి ఢిల్లీకి సూట్‌కేసులు తరలించడమే ప్రభుత్వ అధినేతల పనిగా సాగింది. ఇప్పుడు తెలంగాణను కాంగ్రెస్ అధిష్ఠానం బంగారు గుడ్లు పెట్టే బాతుగా భావిస్తున్నది.

**బీజేపీకి టార్గెట్ ఎందుకు?:** తెలంగాణకే పరిమితమైన టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా పేరు మార్చుకొని జాతీయపార్టీగా అవతరించింది. ఇక్కడ పదేండ్ల పాలనలో దేశానికే రోల్ మాడల్‌గా మారింది. కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇతర రాష్ట్రాలు పేర్లు మార్చి అమలుచేసుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వమే తెలంగాణ ప్రభుత్వానికి లెక్కలేనన్ని అవార్డులను ప్రకటించి ప్రశంసించింది. కేంద్రం కూడా తెలంగాణ పథకాలను కాపీ కొట్టింది. ఒక ప్రాంతీయ పార్టీకి దేశవ్యాప్తంగా ఇంతటి ఆదరణ లభించడం బీజేపీకి మింగుడుపడని అంశం. అందుకే తెలంగాణకు రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రావాల్సిన వాటిని ఇవ్వకుండా కక్ష సాధిస్తున్నది. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను పెంచాలని శాసనసభలో తీర్మానం చేసి పంపినా పక్కన పడేసింది. రాష్ట్రంలో ఏదైనా ఒక నీటిపారుదల ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలని కోరినా పెడచెవిన పెట్టింది. ఇక లాభం లేదనుకొని కాళేశ్వరం ప్రాజెక్టును సొంత ఖర్చుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించుకున్నది. ఇది కేంద్రానికి మరింత కంటగింపుగా మారడంతో ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ప్రధాని మోదీ మొదలుకొని బీజేపీ గల్లీ లీడర్ల వరకు పెద్ద ఎత్తున బురద జల్లడం మొదలుపెట్టారు. టీఆర్ఎస్‌ను కేసీఆర్ బీఆర్ఎస్‌గా మార్చి ఉత్తరాదిపై దృష్టి సారించటంతో మహారాష్ట్రలో కేసీఆర్‌కు మంచి ఆదరణ లభించింది. ఇది బీజేపీకి మింగుడుపడటం లేదు. కేసీఆర్ ఉత్తరాది రాజకీయాల్లోకి వస్తే తమకు ఇబ్బందికరమని భయపడింది. ఈ క్రమంలో కేసీఆర్‌ను లక్ష్యంగా చేస్తూ గతేడాది జూలైలో బీజేపీ హైదరాబాద్‌లో జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించింది. ప్రధాని మోదీ తన కేంద్ర మంత్రివర్గంతోపాటు బీజేపీ పాలిత 18 రాష్ట్రాల సీఎంలు హైదరాబాద్‌లో బలప్రదర్శన చేసి వెళ్లారు. అయితే, ఎమ్మెల్యేలకు ఎర కేసులో బీజేపీని సీఎం కేసీఆర్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవటంతో ఆత్మరక్షణలో పడిన ఆ పార్టీ, కేసీఆర్‌ను ఏమీ చేయలేక ఢిల్లీ లిక్కర్ స్కామ్ పేరిట కొత్త నాటకానికి తెరతీసి అందులో ఎమ్మెల్సీ కవితను ఇరికించింది.

# రైతుకు శాపంగా కాంగ్రెస్ పాలన



కడపత్రి ప్రకాశ్‌రావు
80966 77022

ఈ వ్యాసంలోని ఫొటోలో కనిపిస్తున్నది మునిగె ఎల్లవ్వ. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామం. ఆనాటి పరాయి పాలనలోని కాంగ్రెస్ పార్టీ ఈమె భర్త ఎల్లయ్యను బలిగొన్నది. నిజానికి ఐదెకరాల ఆసామి ఎల్లయ్య. నాటి కరువు, కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మూడెకరాలు అమ్ముకొని బిడ్డల పెళ్లిండ్లు చేశారు. మిగిలిన రెండెకరాల భూమిలో పంట పండించేందుకు కావాల్సిన ఎరువుల కోసం వరుసగా మూడురోజులు ఉదయం వెళ్లి క్యూలో నిలబడటం, సాయంత్రం ఉట్టి చేతులతో తిరిగిరావటం. ఇదే క్రమంలో 2012, సెప్టెంబర్ 3న ఎప్పట్లాగే ఎరువుల కోసం ఉదయం నుంచి క్యూ లైన్లో నిలబడిన ఎల్లయ్య మధ్యాహ్నం 12.30 గంటలకు నీరసించి కుప్పకూలిపోయాడు.

భర్త మరణంతో కుంగిపోయిన ఎల్లవ్వ కుటుంబ భారాన్ని ఎత్తుకున్నది. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగింది. కనిపించినవారికల్లా దరఖాస్తు ఇచ్చింది. అయినా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించలేదు. రైతు అకాల మరణాన్ని చూసి చలించిపోయిన ఇప్పటి మంత్రి, నాటి సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే రూ.2.50 లక్షలు కుటుంబానికి సాయంగా అందించారు. అలాగే నాడు కూతురు పెండ్లి కోసం మూడెకరాల భూమి అమ్మిన ఎల్లవ్వకు మనవరాలి పెండ్లి సమయంలో మాత్రం మేనమామ కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి చేతికందింది. ఇదే పెద్ద కొడుకు కేసీఆర్ ఎల్లవ్వకు పింఛన్ ఇస్తున్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల విషయంలో ఎంత కర్కశత్వంగా వ్యవహరించిందో చెప్పడానికి ఇదో చిన్న ఉదాహరణ. నెర్రెలు బారిన నేలలు, అడుగంటిన భూగర్భజలాలు, అర్ధరాత్రి కరెంటు పెట్టేందుకు వెళ్లి చనిపోయిన రైతులు... ఇవీ నాటి కాంగ్రెస్ పాలనలోని దుర్భర పరిస్థితులు.

**58 ఏండ్ల సమైక్య పాలనలో 42 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ పాలించింది. 16 ఏండ్లు టీడీపీ పాలించింది. దశాబ్దాల పాటు పాలించినా, ఏ ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించలేదు. మరోవైపు కలిసిరాని కాలం, అనుకూలించని పరిస్థితులు, రిక్తహస్తం చూపిన బ్యాంకులు, చిత్తశుద్ధిలోపించిన పాలకులు, విద్యుత్తు లోపాలు, ప్రైవేటు అప్పులన్నీ కలిసి అన్నదాతను మృత్యు ఒడికి చేర్చాయి.**

పాలకుల నిర్లక్ష్యం వల్ల పురుగుల మందునే పెరుగన్నంగా భావించి రైతులు తనువు చాలించారు. కన్నవారికి, కట్టుకున్న భార్యకు, రక్తం పంచుక పుట్టిన బిడ్డలకు పెద్ద దిక్కుగా ఉండాల్సిన రైతులు అర్ధంతరంగా ఆయువు చాలించారు. బలవన్మరణం పొందిన రైతుల్లో అత్యధికం తెలంగాణ వాళ్లే. ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబును గద్దె దించి అధికారంలోకి రావడానికి రైతు ఆత్మహత్యలనే ప్రచారాస్త్రంగా వాడుకున్నది కాంగ్రెస్ పార్టీ. దివంగత సీఎం వైఎస్ 2004లో చేసిన ప్రతి ప్రచారంలో రైతుల ఆత్మహత్యలను వాడుకున్నాడు. తాము అధికారంలోకి వస్తే... బాధిత కుటుంబాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకుంటామన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తామన్నారు. ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపించారు. ఆ మేరకు.. 2004 జూన్ 1న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 421 జీవోను అమల్లోకి తీసుకుచ్చింది. ఈ జీవో ప్రకారం అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.1.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పింది. ఇదే సమయంలో ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి ఇచ్చిన జీవోలో సవాలక్ష కొర్రీలు పెట్టింది. సాగుచేసి అప్పులతో చనిపోయినవాళ్లకు, అదికూడా అధికారులు ధృవీకరించినవారికే వర్తింపజేసింది. ఈ మొత్తంలో రూ.లక్ష కుటుంబసభ్యులపై డిపాజిట్ చేయడం, మిగతా రూ.50 వేలు అప్పులు చెల్లించాలనే విధంగా షరతులు పెట్టింది. జీవో అయితే ఇచ్చారు కానీ, దాని అమలుకోసం మాత్రం నానా తిప్పలు పెట్టారు. బాధిత రైతు కుటుంబాలకు న్యాయం జరగడం లేదని ఎన్నోమార్లు ఎంతో మంది ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. చనిపోయిన రైతు కుటుంబాలపై నాటి ప్రభుత్వాలకు ఉన్న నిర్లక్ష్యానికి ఇదే నిలువెత్తు నిదర్శనం. 42 ఏండ్లు ఈ రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి రైతులపై చూపిన వివక్షకు ఆ జీవో ఒక తార్కాణం. అంతేకాదు, బాధిత రైతు కుటుంబాలకు ఎంతో కొంత సాయం అందించాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి వచ్చి దాన్ని జీవో రూపంలో తేవడానికి కాంగ్రెస్ పాలకులకు నాలుగు దశాబ్దాల కాలం పట్టింది. ఇదీ కాంగ్రెస్ చరిత్ర. ఇప్పుడు రైతుల ఓట్లు కొల్లగొట్టేందుకు కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతున్నది.



**స్వరాష్ట్ర తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్.. అధికార పగ్గాలు చేపట్టగానే కాంగ్రెస్ ఇచ్చిన జీవోను మార్చి రైతు కుటుంబాలపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2014 జూన్ 2 నుంచి ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయడానికి జీవో నంబర్ 173ను విడుదల చేసింది. అక్కడితో ఆగకుండా గుంట భూమి ఉన్న రైతు సైతం ఏ కారణంగా చనిపోయినా అతనికి పది రోజుల్లో రూ.5 లక్షల బీమా పరిహారం అందిస్తున్నది. దేశంలోనే రైతుకు రూ. 5 లక్షల బీమా కవరేజీ అందించిన తొలి రాష్ట్రం తెలంగాణే. ఉదాత్త ఆశయంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం బాధిత రైతు కుటుంబాలకు కొండంత భరోసాను అందిస్తున్నది.**

రైతుబీమాను పొందడానికి బాధిత రైతు కుటుంబం ఇప్పుడు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన అవసరం లేదు. నేరుగా నామినీ ఖాతాల్లోనే డబ్బులు జమవుతాయి. రైతులకు ఇది చేస్తం, అది చేస్తం అనే చెప్పే పార్టీలు కాకుండా ఇప్పటివరకు రైతులకు ఏయే పార్టీలు ఏమేం చేశాయో రైతులు తెలుసుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన కరెంటు అందిస్తున్నది. తక్కువ సమయంలో ఎక్కువ ప్రాజెక్టులు నిర్మించి సాగు విస్తీర్ణం పెరిగేలా కృషిచేసింది. మొత్తంగా రైతును తలెత్తుకొని తిరిగేలా చేసింది ఒక్క కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమే.

(వ్యాసకర్త: నమస్తే తెలంగాణ ప్రతినిధి, కరీంనగర్)